క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి


భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో వేస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం చేయాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. సోమవారం కావేరిరాజుపురం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మంచి పౌష్టికాహారం పెట్టాలనే ఉద్దేశంతో జగనన్న గోరుముద్ద పథకంలో రోజుకు ఒక మెనూ, ప్రతిరోజు ఉడికిన గుడ్డు, చిక్కీ వేస్తున్నారు. కొత్త మెనూ ప్రకారం తాజా కూరగాయలు ఉపయోగించుకుని నాణ్యతగా భోజనం చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో నాణ్యత లోపిస్తే సంబంధిత హెచ్‌ఎం బాధ్యత అన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ


యూనిఫాం అందజేస్తున్న చాణక్య, టీచర్లు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పూర్వ విద్యార్థి చాణక్య క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానంగా రెజ్లింగ్, జూడో పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు పూర్వ విద్యార్థి చాణక్య ఉచితంగా యూనిఫాం అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం లలిత కుమారి మాట్లాడుతూ దాతలు అందించే సహకారంతో విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ త్రిలోకసుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏటీఎల్ ల్యాబ్ ప్రదర్శనలు పెరగాలి


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు

నగరి: విద్యార్థులు అతల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)కు సంబంధించిన ప్రదర్శనలను భవిష్యత్తులో ఎక్కువగా నిర్వహించాలని స్టేట్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు మహమ్మద్ జాకీర్ హుస్సేన్, మోహన్ సింగ్ అన్నారు. సోమవారం నగరి పట్టణంలోని ఎస్‌జీఎస్ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని ల్యాబ్‌లను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ల్యాబ్‌లలోని పరికరాలు వాటికి సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. ల్యాబ్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన వారు, అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ల్యాబ్ వినియోగం ఇంకా మెరుగుపరుచుకోవడానికి తగు సూచనలు ఇచ్చారు. భవిష్యత్ కార్యక్రమాల్లో ఏటీఎల్ ల్యాబ్‌కు సంబంధించిన ప్రదర్శనలు మెండుగా ఉండాలని సూచించారు. జిల్లాస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆశించారు. పాఠశాలలో హెచ్‌ఎం పార్వతీ దేవి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నవంబరు 9 నుండి 11వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలు కరపత్రాలను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం సోమవారం ఆవిష్కరించారు. పవిత్రోత్సవాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. నవంబరు 8న అంకురార్పణ జరుగనుంది. 9న పవిత్ర ప్రతిష్ఠ, 10న పవిత్ర సమర్పణ, 11న పూర్ణాహుతి నిర్వహించనున్నారు. నవంబరు 8న అష్టోత్తర శతకలశాభిషేకం, నవంబరు 9 నుంచి 11వ తేదీ వరకు కల్యాణోత్సవం, 9న తిరుప్పావడ సేవ రద్దయ్యాయి. గృహస్తులు(ఇద్దరు) రూ.516/- చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. ఒక పవిత్రం, ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేస్తారు. డెప్యూటీ ఈవో వరలక్ష్మి, పీఆర్వో డా.టి.రవి, సూపరింటెండెంట్ చెంగల్రాయలు, అర్చకులు బాలాజీ రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విశ్రాంత ఉద్యోగులకు టీటీడీ ప్రసాదాలు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల అనంతరం టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛన్‌దార్లకు అందించే శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదాన్ని నవంబర్ 1వ తేదీ బుధవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు అందించనున్నారు. తిరుపతిలోని టీటీడీ క్యాంటీన్ వద్దనున్న కొత్త జాబిలి భవనంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. పింఛన్‌దార్లు తమ స్మార్టు కార్డు చూపి ఒక పెద్ద లడ్డూ, ఒక వడ పొందవచ్చు. పీపీఓ నంబర్ల వారీగా ప్రసాదాల పంపిణీ జరుగుతుంది.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతమే లక్ష్యం

- డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి


వంట పాత్రలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే సీఎం జగనన్న లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె గుంట ప్రాథమిక పాఠశాలలో 80 పాఠశాలలకు ప్రభుత్వం అందించిన రూ.7 లక్షల విలువ జేసే వంట పాత్రలను ఎంపీపీ లత ఆధ్వర్యంలో వంట కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రతిరోజు మంచి పౌష్టికాహారం అందించడం గొప్ప విషయమన్నారు. నేటి విద్యార్థులే దేశ భవిష్యత్‌కు పౌరులు అని, వారి ఆరోగ్యానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వడం హర్షణీయమన్నారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగనన్న నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దారని అన్నారు. రోజువారి మెనూ ప్రకారం పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం సిద్ధం చేయడానికి అవసరమయ్యే పాత్రలను ప్రభుత్వం పంపిణీ చేయడం ఆనందరంగా ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మిని, ఎంపీపీని ఎంఈఓ మనోజ్‌కుమార్, ఆర్కే స్వార్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటేశ్వరరావు శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, మండల కన్వీనర్ శేఖర్ రాజు, ఉప సర్పంచ్ శేషాద్రి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రేఖ, సీఆర్పీలు, హెచ్‌ఎం యుగంధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి


కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని చిదా స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం అక్రమంగా విక్రయిస్తున్న ప్రభుత్వ భూమిని పరిరక్షించాలంటూ మిల్లు కార్మికులు సోమవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకుడు బాబు మాట్లాడుతూ నందిమంగళం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబర్ 31/1 నోషనల్ ఖాతా నంబర్ 300009 లోని భూమి పూర విస్తీర్ణం 2.83 ఎకరాలను తెలిపారు. ఈ భూమిని మిల్లు అవసరాలకు వినియోగించుకోవల్సిందిగా ప్రభుత్వం కేటాయించిందని, సదరు భూమిని విక్రయించే అధికారం యాజమాన్యానికి లేదని వివరించారు. అక్రమంగా మిల్లును మూసివేసి, సదరు ప్రభుత్వ భూమితో పాటు మిల్లును అమ్మడానికి యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్మికులకు సైతం చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని చెల్లించకుండా అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సదరు విషయంపై కార్మికులు రాష్ట్ర హైకోర్టులో కేసును సైతం నడుపుతున్నారని, ఇందుకు సంబంధించిన అన్ని పత్రాలను కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అక్రమంగా అమ్మకాలకు పాల్పడుతున్న మిల్లు యాజమాన్యంపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి, కార్మికసంఘ నాయకులు బాబు, రమేష్, శివలింగం పాల్గొన్నారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు శిక్షణ


అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలపై అంచనా కోసం ఎంపిక చేసిన పరీక్ష ఎలా నిర్వహించాలనే దానిపై ఇన్వెస్టిగేటర్లకు సోమవారం ఎమ్మార్సీలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే కోసం మండలాన్ని ఎంపిక చేశారన్నారు. ఇందులో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులను సర్వే చేశామని తెలిపారు. వచ్చే నెల 3న నిర్వహించే ఈ సర్వే ద్వారా దేశంలోని ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యా వ్యవస్థలోని బలాలు, బలహీనతలు అంచనా వేయవచ్చన్నారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ పరీక్షకు సంబంధించి ఇంజినీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు విధి విధానాలపై అవగాహన కల్పించారు. 60 నిమిషాల్లో 40 ప్రశ్నలకు, 9వ తరగతి విద్యార్థులు 90 నిమిషాల్లో 60 ప్రశ్నలకు జవాబులు ఓఎంఆర్ షీట్స్‌లో రాయాల్సి ఉంటుందన్నారు. దివ్యాంగులు ఈ పరీక్షకు హాజరైతే, వారికి అదనంగా 30 నిమిషాలు కేటాయింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 గిరిజ, సీఆర్పీలు శరవణన్, మునిరాజ్, రాజేశ్వరి, మహాలక్ష్మి, ఇన్వెస్టిగేటర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధర నెల్లూరు: ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు శ్రీరామరక్షగా నిలుస్తోందని ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని వేల్కూరు గ్రామ పంచాయతీలో సోమవారం సర్పంచ్ లలిత, సింగిల్‌విండో అధ్యక్షుడు వేల్కూరు బాబు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే నిత్యం చిరుధాన్యాలను విధిగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ ఈ పథకం ద్వారా రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మెరుగైన వైద్యం అవసరమైన వారిని పెద్ద ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ ద్వారా పంపిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బిందుమాలతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు చిరుధాన్యాల ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన మెడికల్ కిట్లు, కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంజని, ఈఓపీఆర్డీ రాఘవేంద్ర రాజు, పంచాయతీ కార్యదర్శి శివయ్య, వైద్యుల బృందం డా.ప్రశాంత్, డా.దుర్గాదేవి, డా.పావని చంద్ర, డా.శివరామకృష్ణ, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జవాన్ కుటుంబానికి అండగా ఉంటాం


రామ్‌ఖీ తండ్రి రత్నం మేస్త్రీని ఓదార్చుతున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: దేశానికి భద్రత కల్పించే ఆర్మీ జవాన్ రామ్‌ఖీ(35) ఆకస్మిక మరణం బాధాకరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. సోమవారం రామ్‌ఖీ కుటుంబాన్ని మంత్రి కుమార్తె కృపాలక్ష్మి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నిరంతరం పోరాటం చేసే జవాన్ తన తల్లిదండ్రులను చూసేందుకు ఇంటికి వస్తూ మరణించడం బాధాకరమన్నారు. సైనికుడు రామ్‌ఖీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం రామ్‌ఖీ తండ్రి రత్నం మేస్త్రీని ఓదార్చారు. ఆమె వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, గాంధీ, చందురాజు, మాజీ సర్పంచ్ మునిక్రిష్ణ, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ సుబ్రమణ్యం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్టీ అసిస్టెంట్ హరీష్ మృతికి నివాళి

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు దళితవాడలో కరెంట్ షాక్‌తో మృతి చెందిన హరీష్(26) మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నాయకురాలు కృపాలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆర్థిక పరిస్థితిపై వాకబు చేశారు. అధైర్య పడవద్దని, ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని చెప్పారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు మంత్రి నారాయణస్వామి కృషి చేస్తారని చెప్పారు. మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు భారతి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నాయకులు ధనుంజయరెడ్డి, దామోదరరెడ్డి ఉన్నారు. అంతకు ముందు అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యంను కృపాలక్ష్మి పరామర్శించారు.

ఢిల్లీ చేరిన నగరి మట్టి


ఢిల్లీ పార్లమెంట్ భవనం వద్ద భారీ కలశంలో మట్టిని వేస్తున్న సురేష్‌రాజు

పుత్తూరు రూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చేపట్టిన 'నాభూమి–నాదేశం' కార్యక్రమంలో సేకరించిన మట్టిని నగరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఢిల్లీకి చేర్చారు. వడమాలపేట జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు, నోడల్ ఆఫీసర్లు నాయక్, గిరిరాజు తదితరులు తమ వెంట తీసుకెళ్లిన మట్టిని నూతన పార్లమెంట్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన భారీ కలశంలో వేశారు. ఈ సందర్భంగా సురేష్‌రాజు మాట్లాడుతూ ఢిల్లీలో అమృత్ వాటిక నిర్మాణంలో నగరి నియోజకవర్గ భాగస్వామిగా తాను అమృత్ కలశ్ ద్వారా మట్టిని చెల్లించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. స్వాతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ దేశ భక్తిని పెంపొందించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామివారికి సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని వేకువజామునే సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వరుడికి పాలు, పెరుగు, నారికేళ, విబూదితో అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్పందన వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: స్పందనలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ బెన్నూరాజు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 22 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 05, శ్మశానానికి దారి 01, డీకేటీ పట్టా కేటాయించాలని 03, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 02, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01, మెదవాడ ఎస్టీ కాలనీ వాసులకు ఇంటి స్థలం ఇప్పించాలని 13 వినతులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనలో వచ్చే వినతుల పరిష్కారానికి వెంటనే స్పందించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిత, నాయకులు జనార్దన్, కుప్పయ్య, సుధాకర్ తంబి, రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ మీట్

నగరి: పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన అండర్–14 బాలుర జట్టు


ఎంపికైన అండర్–14 బాలికల జట్టు

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్–14 బాల, బాలికల జట్లను ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం పాఠశాల మైదానంలో హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ అధ్యక్షతన, జిల్లా డెప్యూటీ డీఈఓ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన అండర్–14 విభాగంలో బాల, బాలికలకు జిల్లాస్థాయి టోర్నమెంట్ నిర్వహించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక చేశామన్నారు. డెప్యూటీ జిల్లా విద్యాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమన్నారు. ఆటలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగయ్య, టీచర్లు యుగంధర్ ఆచారి, ఎస్‌ఎంసీ చైర్మన్ గోవర్ధన గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్ బాబు, వెంకటేష్, సెల్వపాండియన్, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్–14 బాలుర జట్టు..
అనిల్, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణు, మహ్మద్ మూవాద్, సందీప్, నిరంజన్, విశ్వ, కార్తికేయన్, నిహార్ రెడ్డి, లవన్‌కుమార్, కార్తిక్, సంతోష్ ఎంపికయ్యారు.

అండర్–14 బాలికల జట్టు..
అనుశ్రీ, ఇందు, మధులత, కుమారి, భవ్యశ్రీ, దేవశ్రీ, వసు, అమృత, పెంచలమ్మ, వందన, రుచిత, బిందుశ్రీ ఎంపికయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న డిప్యూటీ డీఈఓ చంద్రశేఖర్, మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ

శ్రీరంగరాజపురం: విద్యార్థులకు పరిశుభ్రమైన నాణ్యతతో కూడిన భోజనం అందించాలని డిప్యూటీ డీఈఓ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో ప్రయోగశాల ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యా ప్రయోగశాల నిపుణులు త్వరలో పాఠశాలను సందర్శిస్తారని, ఉపాధ్యాయులు విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక ప్రయోగాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు చదువుకోవడంలో పాటించవలసిన మెలకువలను నేర్పించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం శాంతి, ఉపాధ్యాయులు షణ్ముగం, బండి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలతో హిమోగ్లోబిన్ పెంపు


విద్యార్థినులకు మందులు అందిస్తున్న వైద్యసిబ్బంది, లెక్చరర్లు

నగరి: పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వైద్యసిబ్బంది విద్యార్థినులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం మహిళా సాధికారిత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 120 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు చేసి ఐరన్, క్యాల్షియం, జింక్, బీకాంప్లెక్స్, పారాసిట్మల్ మాత్రలను శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా అందించారు. విద్యార్థినుల ఆరోగ్యానికి తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించారు. శరీరంలో హిమోగ్లోబిన్ పెంచుకోవడానికి ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భాస్కర్ రాజు, మహిళా సాధికారత విభాగం కౌన్సిలర్ ఇందిరాప్రియదర్శిని, అధ్యాపకులు భాస్కర్‌రాజు, అరుణకుమార్, పంకజ, సుహాసిని, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.